క్లుప్తంగా

వాటర్ ప్లాంట్లలో విజిలెన్స్ తనిఖీలు



వాటర్ ప్లాంట్‌లో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ బృందం

నరసన్నపేట: వాటర్ ప్లాంట్లలో ప్రమాణాలు తెలుసుకునేందుకు విజిలెన్స్ శాఖ శుక్రవారం తనిఖీలు చేపట్టింది. ప్రాంతీయ నిఘా, అమలు అధికారి ఎ.సురేష్‌బాబు ఆదేశాల మేరకు మండల పరిధిలోని జమ్ము కూడలి వద్ద ఉన్న వాటర్ ప్లాంట్‌లో విజిలెన్స్ ఎస్‌ఐ అశోక్, ఏఈ ప్రేమకుమార్, ఆహార భద్రతా అఫీసర్ లక్ష్మి తనిఖీ చేశారు. నిబంధనల మేరకు నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని గుర్తించి యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని పైఅధికారులకు నివేదిక పంపనున్నట్లు తెలిపారు.

నవధాన్యాల పంటతో భూమి సారవంతం



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయం సిబ్బంది

పొందూరు: నవధాన్యాల పంటతో భూమి సారవంతమవుతుందని ప్రకృతి వ్యవసాయం ఏపీసీఎన్ఎఫ్ శంకర్ తెలిపారు. తండ్యాం గ్రామంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయం సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. భూమి సారవంతంగా ఉండేందుకు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలన్నారు. 365 రోజులూ పంటలు పండిస్తూ ఉంటే భూమి నిత్యం సారవంతంగా ఉంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయం ఎంటీ కృష్ణ, ఎస్‌డీఏ రాంబాబు, రైతులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్విరాన్‌మెంట్ పరీక్ష



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

హిరమండలం: ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఇంటర్ బోర్డు నిర్వహించిన (ఎన్విరాన్‌మెంట్) పర్యావరణ విద్య పరీక్ష శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పీఈఎస్ పట్నాయక్ తెలిపారు. 95 మంది విద్యార్థుల్లో ఇద్దరు గైర్హజరైనట్లు పేర్కొన్నారు

నియోజకవర్గంలో 4,158 మంది ఓటర్లు

పాతపట్నం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికలకు ఏర్పాట్లు చురుగ్గా నిర్వహిస్తున్నామని తహసీల్దార్ కె.రవిచంద్ర అన్నారు. నియోజకవర్గంలో 4,158 మంది ఓటర్లు ఉన్నారని, ఆరు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పాతపట్నం మండలంలో రెండు పోలింగ్ కేంద్రాల్లో 821 మందికి కేటాయించామన్నారు. కొత్తూరు మండలంలోని ఒక పోలింగ్ కేంద్రంలో 1,228 మందికి, మెళియాపుట్టి మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రంలో 852 మందికి, హిరమండలం మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రంలో 760 మందికి, ఎల్.ఎన్.పేట మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రంలో 497 మందికి కేటాయించినట్లు తెలిపారు.

విద్యా బోధనపై ప్రత్యేక దృష్టి

ఎల్.ఎన్.పేట: విద్యా బోధన పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈఓ ఎన్.శ్రీనివాసరావు ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని జాడుపేట ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన వార్షిక తనిఖీ నిర్వహించారు. ప్రతీ విద్యార్థి తరగతి గదిలో ఎలా చదువుతున్నాడో పరిశీలించాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేకంగా బోధన చేయాలన్నారు. జగనన్న గోరుముద్ద పథకం అమలు తీరును పరిశీలించారు. ప్రభుత్వం ప్రకటించిన మెనూ అమలయ్యేలా చూడాలని ఉపాధ్యాయలకు సూచించారు. పర్యవేక్షణ అధికారులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

కొత్తూరు: బోధనోపకరణాలు ఉపయోగించి మరింత ఉత్తమ బోధన ఉండాలని ఎంఈఓ బి.శ్రీధర్ అన్నారు. మండలంలోని మాకవరం యూపీ పాఠశాలను శుక్రవారం వార్షిక తనిఖీ చేపట్టారు. తరగతుల వారిగా విద్యాప్రమాణాలు తెలుసుకున్నారు. మధ్యాహ్నం భోజన పథకాన్ని పరిశీలించారు. సీఆర్పీలు పాల్గొన్నారు.

వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి

హిరమండలం: గ్రామీణ వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ సి.హెచ్.సాయిగీత, డాక్టర్ జి.శ్యామల్ అన్నారు. మేజర్ పంచాయతీ హిరమండలం పెద్దకోరాడ అంగన్‌వాడీ కేంద్ర ఆవరణంలో 104 సంచార వైద్య వాహన ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ (ఎఫ్‌పీసీ) గ్రామీణ వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులు, గర్భిణులకు వైద్య సేవలు అందించారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం



నరసన్నపేట: మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లో తీసుకెళ్లాలి
- ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి

నరసన్నపేట: వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా గృహసారథులు పనిచేయాలని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నమ్మకాన్ని నిలబెట్టాలని, రానున్న విజయాలకు మీరే సారథులని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని ఉర్లాం, నరసన్నపేటల్లో గల ప్రైవేటు కల్యాణ మండపాల్లో సచివాలయ మండల కన్వీనర్ సురంగి నర్సింగరావు అధ్యక్షతన గృహసారథుల శిక్షణ కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. టీడీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. గృహ సారథులకు అప్పగించిన 25 ఇళ్లకు వెళ్లి పరిచయాలు చేసుకోవాలన్నారు. వారికి సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు సహకరించాలన్నారు. మండలంలో ఉన్న పార్టీ నాయకులు, వలంటీర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, నరసన్నపేట, పోలాకి సర్పంచ్‌లు బూరల్లి శంకర్, పోలాకి నర్సింహమూర్తి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బార్ల వేణుగోపాలరావు, పార్టీ నాయకులు దాలినాయుడు, యబాజి రమేష్, చింతల వెంకటరావు, నడిమింటి శాంతారావు, లుకలాపు రవి, పుట్టా ఆదిలక్ష్మి, బొబ్బాది ఈశ్వరరావు, చీపురు కృష్ణ, పంగబావాజీ నాయుడు, పాగోటి రాజారావు, వాన గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

గృహ సారథులపైనే పూర్తి బాధ్యతలు

మెళియాపుట్టి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందించే బాధ్యత గృహ సారథులపైనే ఉందని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండల కేంద్రంలో గృహ సారథులు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గ్రామ వలంటీర్లతో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి తీసుకువచ్చిన సంక్షేమ పథకాలతో లబ్ధి పొందిన ప్రయోజనాలను వివరించాలన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండు సమానంగా జరుగుతున్నాయన్నారు. అర్హత ఉంటే సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే అందిస్తున్నారని గుర్తుచేశారు. పాతపట్నం నియోజకవర్గం పరిశీలకులు, ఎమ్మెల్సీ సురేష్ రాజు మాట్లాడుతూ మార్చి 18 నుంచి గృహసారథులు ఇంటింటికీ వెళ్లి మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్లు అతికించాలన్నారు. జెడ్పీటీసీ గూడ ఎండయ్య, పార్టీ నాయకులు బైపోతు ఉదయ్ కుమార్, ఉర్లాన బాలరాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



మెళియాపుట్టి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

శివరాత్రి ఉత్సవాలకు సహకరించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ శివరామిరెడ్డి

- డీఎస్పీ శివరామి రెడ్డి

జలుమూరు: శ్రీముఖలింగం శివరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అందరూ సహకరించాలని డీఎస్పీ శివరామి రెడ్డి అన్నారు. శుక్రవారం శ్రీముఖలింగం ఆవరణలో బందోబస్త్‌పై సిబ్బందితో మాట్లాడారు. క్యూలు, బారికేడ్లు వద్ద నిరంతరం నిఘా ఉండాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణతోపాటు గ్రామం ముందు ఇరువైపులా పార్కింగ్ పాయింట్ల వద్ద వాహనాలు నిలిపేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పాయింట్లు వారిగా ఏర్పాట్లు చేసిన సిబ్బంది విధి నిర్వహణ బాధ్యతగా ఉండాలన్నారు. సీఐ రాము, ఎస్‌ఐ పారినాయుడు సిబ్బంది ఉన్నారు.

సందడిగా ఓపెన్ డే

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం' ఓపెన్ డే' సందడిగా జరిగింది. వివిధ ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు చెందిన ద్వితీయ సంవత్సరం విద్యార్థులు వచ్చి ఓపెన్ డేలో పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్న సౌకర్యాలు, బోధనా, ఇతర వసతులు గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ శాంతి హేమ్ మాట్లాడుతూ కళాశాలలో ఉన్న సౌకర్యాలు గురించి వివరించారు. ప్రయోగ పద్ధతులు, గ్రీన్‌క్యాంపస్, జేకేసీ, లైబ్రరీ, జిమ్, డిజిటల్, వర్చువల్ క్లాసుల గురించి తెలియజేశారు. పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.



సదుపాయాలను వివరిస్తున్న వైస్ ప్రిన్సిపాల్, తదితరులు

ఎన్నికల నియమావళి అమలుచేయాలి

హిరమండలం: ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో గ్రామాల్లో ఎన్నికల నియమావళి కచ్చితంగా అమలు చేయాలని తహసీల్దార్ బి.మురళీమోహన్, ఎంపీడీఓ బి.శైలజ సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌ఓలు, గ్రామ సచివాలయ పోలీస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు తొలగించాలని, నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలన్నారు. ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితా ఇప్పటికే ప్రదర్శించామన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు కృషిచేయాలన్నారు.

సారవకోట: మార్చిలో జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయనున్నట్లు తహసీల్దార్ ప్రవల్లికాప్రియ తెలిపారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో సంబంధిత సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున్న రాజకీయ పార్టీలకు సంబంధించిన అన్ని ఫ్లెక్సీలు, బ్యానర్లు, జెండాలను తొలగించాలని సూచించారు. ఎస్‌ఐ అప్పారావు, డీటీ సరిత ఉన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

పాతపట్నం: మార్చి 16న జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా నిర్వహించేలా అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని తహసీల్దార్ కె.రవిచంద్ర కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీ నాయకులు, ఎస్‌ఐ కామేశ్వరరావుతో కలిసి శుక్రవారం సమావేశం నిరహించారు. ఎంటువంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలింగ్ బూత్‌ల నిర్వహణపై అవగాహన కల్పించారు. నాయకులు సవిరిగాన ప్రదీప్, జి.రాము, నక్క క్రాంతి, చిరంజీవి, రాజారావు, ఎలక్షన్ డీటీ ఎ.శైలజ పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తి అవసరం

- పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య
- ధర్మాన ప్రీమియర్ లీగ్ సీజన్ ఫోర్ క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ధర్మాన కృష్ణచైతన్య

నరసన్నపేట: ప్రతి ఒక్కరికీ క్రీడా స్ఫూర్తి అవసరమని, క్రీడల్లో గెలుపు, ఓటమిని ఒకేలా తీసుకోవాలని పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య అన్నారు. ధర్మాన ప్రీమియర్ లీగ్ సీజన్ ఫోర్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం ప్రారంభించారు. టోర్నమెంట్‌లో పాల్గొన్న 46 జట్ల సభ్యులను పరిచయం చేసుకున్నారు. వివాదాలు లేకుండా పోటీలు పూర్తిచేయాలని సూచించారు. శివరాత్రి సందర్భంగా డే అండ్ నైట్ టోర్నీ నిర్వాహకులను అభినందించారు. గడిచిన మూడేళ్లుగా ఈ టోర్నీ దిగ్విజయంగా నిర్వహించారని, నాల్గో సీజన్ కూడా బాగా నిర్వహించాలని కోరారు. ఆర్ఎస్ఏ క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధి పెదిరెడ్ల రాము మాట్లాడుతూ 46 జట్లు పాల్గొన్నాయని, నాకౌట్ పద్ధతిలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు బాబ్జి, దాలినాయుడు, ప్రసాద్, డేవిడ్, కేశవరాజు, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణసాయం అందజేత

కొత్తూరు: మండలంలోని ఇరపాడుగూడకు చెందిన సవర తిరుపతిరావు అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం మృతుడి భార్య రాధకు వైఎస్సార్ బీమా తక్షణసాయం తక్షణ సహాయం కింద రూ.10 వేల నగదును సర్పంచ్ ఎస్. ఫల్గుణరావు అందజేశారు. పంచాయతీ కార్యదర్శి ఢిల్లేశ్వరరావు, వెల్ఫేర్ అసిసెంట్ సుజాత ఉన్నారు.

బీమా మొత్తం అందజేస్తున్న సర్పంచ్, కార్యదర్శి



మహిళ మృత అవశేషాలపై క్లూస్ టీమ్ పరిశీలన

భామిని: మండలంలో సంచలనం రేపిన మహిళ మృత అవశేషాల లభ్యతపై వివరాలు సేకరించడానికి బత్తిలి ఎస్సై వై.అమ్మాన్‌రావు ఆధ్వర్యంలో క్లూస్ టీం శుక్రవారం రంగంలోకి దిగింది. ఈ మేరకు భామిని మండలం కొరమ సమీపంలో గురువారం గుర్తించిన మహిళ మృతదేహం ఆనవాళ్లను పరిశీలించి ఆధారాలు సేకరించారు. పెద్దదిమిలి వీఆర్‌ఓ పి.వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో సంఘటనా స్థలంలో అవసరమైన వివరాలు తీసుకున్నారు. మృతురాలు ఎవరు? ఎలా మృతి చెందింది? హత్యా? ఆత్మహత్యా? అనే విషయాలు తెలుసుకునేందుకు క్లూస్‌టీం శ్రమించింది. అయితే వేరే చోట హత్య చేసిన కొన్నాళ్లకు ఇక్కడికి తెచ్చి పడవేశారనే అనుమానాలు ఎక్కువగా రేగుతున్నాయి. పాలకొండ ఏరియా ఆస్పత్రిలో భద్రపరిచిన అవశేషాలను క్లూస్ టీమ్ పరిశీలన అనంతరం డీఎన్ఏ పరీక్షకు విజయవాడ పంపుతున్నట్లు ఎస్సై అమ్మాన్‌రావు తెలిపారు. మృతురాలు చీర, వయస్సు, జుత్తును పరిశీలించి శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం మెట్టూరు బిట్–2కు చెందిన వివాహిత రంజితగా భావిస్తున్నారు. గత నెల–1 తేదీన భామిని మండలం పెద్దదిమిలి గ్రామానికి వచ్చి బంధువుల ఇంటికి వచ్చి తిరిగివెళ్లే సమయంలో ఆమె అదృశ్యమైనట్లు భర్త ఫిర్యాదు చేసి ఉన్నాడు. రంజిత వచ్చిన పెద్దదిమిలి గ్రామానికి అవశేషాలు లభించిన కొరమ గ్రామానికి మధ్య మూడు కిలోమీటర్ల దూరం కావడంతో అనుమానాలు బలపడుతున్నాయి.



మృతురాలి అవశేషాలను ఆస్పత్రిలో పరిశీలిస్తున్న క్లూస్ టీం

పరామర్శ..



వలంటీర్ రాజశేఖర్‌కు ధైర్యం చెబుతున్న చిరంజీవినాగ్

ఆమదాలవలస రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి శ్రీకాకుళం పట్టణంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రామచంద్రాపురం గ్రామ వలంటీర్ మండల రాజశేఖర్‌ను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ శుక్రవారం పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. రాజశేఖర్ ఇటీవల మండల సోషల్ మీడియా కో కన్వీనర్‌గా ఎంపికైనట్లు తెలిపారు. పరామర్శించిన వారిలో మాజీ సర్పంచ్ చల్లా సింహాచలం ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ఆమదాలవలస రూరల్: ఆర్థిక అక్షరాస్యతతో కుటుంబం అభివృద్ధి బాటలో నడుస్తుందని యూనియన్ బ్యాంక్ సీఎఫ్ఎల్ ఫీల్డ్ ఇన్‌చార్జి చిగురుపల్లి వెంకటేష్, రామారావు అన్నారు. మండలంలో తురకపేట గ్రామంలో ఆర్థిక అక్షరాస్యతపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కుటుంబంలో ఉన్న సభ్యులు పొదుపు చేయడం వల్ల భవిష్యత్‌లో అవసరాలకు ఆసరాగా నిలుస్తుందని తెలిపారు. పొదుపు చేయడం ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకుంటే అనవసర ఖర్చులు తగ్గి కుటుంబానికి ఎంతో ఆసరాగా నిలుస్తుందన్నారు. బ్యాంకుల్లో ప్రభుత్వ బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏటీఎం కార్డు వినియోగాలు, డిజిటల్ మోసాల గురించి వివరించారు. ఫీల్డ్ అసిస్టెంట్ ఎం.శ్రీనివాసరావు, ఉపాధి వేతనదారులు పాల్గొన్నారు.

20న వాహనాల వేలం

పాతపట్నం: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను మండలంలోని ప్రహరాజపాలెంలోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో ఈ నెల 20న వేలం వేయనున్నారు. ఈ మేరకు ఎస్ఈబీ సీఐ వై.లక్ష్మనాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ద్విచక్రవాహనాలు, రెండు ఆటోలను వేలం వేయనున్నామని, ఆసక్తి ఉన్నవారు ఉదయం పది గంటలకు ఎస్ఈబీ స్టేషన్ వద్దకు రావాలన్నారు. ఆధార్ జిరాక్స్‌తోపాటు రూ.1000 ముందస్తుగా చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

స్వామివారి తిరువీధికి వాహనాల సిద్ధం



నంది వాహనాన్ని సిద్ధం చేస్తున్న దృశ్యం



పార్వతీపరమేశ్వరుల ఉత్సవమూర్తులను శుభ్రం చేస్తున్న దృశ్యం

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో ఈ నెల 18 నుంచి 120 వరకు జరగనున్న శివరాత్రి ఉత్సవాలకు ఉత్సవమూర్తులతోపాటు నంది, గజ వాహనాలు శుక్రవారం సిద్ధం చేశారు. శివరాత్రి రోజు లింగాభరణం అనంతరం పార్వతీపరమేశ్వరుల ఉత్సవ మూర్తులను అలంకరించి గజ వాహనంపై తిరువీధి నిర్వహిస్తారు. 20న అమవాస్య అనంతరం పాడ్యమి ఘడియలు ప్రారంభంలో స్వామివారిని నంది వాహనంపై వంశధార నది తీరంలో పుణ్యచక్రతీర్థ స్నానాలు చేయడం సంప్రదాయం. దీని కోసం నంది వాహనం కూడా సిద్ధం చేస్తున్నట్లు అర్చకులు తెలిపారు. నాగాభరణాలు, పూజా సామగ్రి సిద్ధం చేశారు.

సంక్షిప్తంగా..

ఏకగ్రీవంగా పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గం

నరసన్నపేట: మండలంలోని 34 పంచాయతీల్లో ఉన్న పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారం ఎంపీడీఓ బి.మధుసూదనరావు ఆధ్వర్యంలో జరిగింది. కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లుకలాం కార్యదర్శి పైల ముకుందరావు, ఉపాధ్యక్షుడిగా డోకి సాయిరాం, కార్యదర్శిగా అల్లు రవి, సహాయ కార్యదర్శిగా జావేద్, కోశాధికారిగా గీతాంజలిని ఎన్నుకున్నారు.

నేటినుంచి ఆలయాల వార్షికోత్సవాలు

సారవకోట: మండల కేంద్రంలోని మండలాధీశ్వర స్వామి ఆలయ 60వ వార్షికోత్సవ మహోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రతి ఏటా మహాశివ రాత్రి నుంచి మూడు రోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. అంగూరు గ్రామంలోని కుంభేశ్వర స్వామి, నౌతళలోని స్వయంభూ రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో వార్షికోత్సవ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మహాశివరాత్రికి సర్వం సిద్ధం



కొత్తూరు: శివ జయంతి సందర్భంగా కేక్‌ను కట్ చేస్తున్న కొత్తూరు సర్పంచ్ పడాల కృష్ణవేణి, వైస్ ఎంపీపీ తులసీవరప్రసాదరావు

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శివాలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. ఈ ఏడాది మహాశివరాత్రి పర్వదినం శనివారం, శనిత్రయోదశి కావడంతో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుందని ఆలయ అర్చకులు చెబున్నారు. శివాలయాలకు పూజలు నిర్వహించేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. బారిగేట్లు ఏర్పాటు చేయడం, తాగునీటి సదుపాయం కల్పించడం, వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక దర్శన ఏర్పాట్లు వంటి కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. – సాక్షి నెట్‌వర్క్



కొత్తూరు: కృష్ణాపురంలోని ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయం



ఎల్.ఎన్.పేట: శివరాత్రి పూజలకు ముస్తాబైన మెదుగువలస శివాలయం



ఎల్.ఎన్.పేట: బారికేడ్లు సిద్ధం చేస్తున్న కుశమలపాడు శివాలయం



ఆమదాలవలస రూరల్: పూజలు అందుకోనున్న సంగమేశ్వరస్వామి



సరుబుజ్జిలి: సర్వాంగసుందరంగా సిద్ధమైన దంతపురి శివాలయం